క్లుప్తంగా

దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలి

తహసీల్దార్ అజాంఅలీ



సమావేశంలో మాట్లాడుతున్న అజాంఅలీ

కేశంపేట: ప్రజాపాలనలో ప్రజలు రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ అజాంఅలీ సూచించారు. కేశంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం 2,600ల దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటికే 1,700ల దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు వెల్లడించారు. ఆయా గ్రామాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు మిగిలిన 900ల దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పరిశీలనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై తనిఖీలు



కొందుర్గు పౌల్ట్రీ పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కొందుర్గు: వ్యవసాయ పంటలకు వినియోగించే యూరియాను ఇతర పరిశ్రమలకు వాడుతున్నారనే ఆరోపణతో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఏఓ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐ రవీందర్‌నాయక్ బుధవారం పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. కొందుర్గు, ఆగిర్యాల, తంగెళ్లపల్లి తదితర గ్రామాల్లోని పౌల్ట్రీ పరిశ్రమ ల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల నిర్వాహకులు వ్యవసాయానికి ఉపయోగించే యూరియాను అనుమతులు లేకుండా ఇతర వాటికి ఉపయోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోళ్లకు వినియోగించే దాణాలో ఏఏ పదార్థాలు ఉంటాయే ఆ సంచులపై నమోదు చేయాలని సూచించారు.

వాగుపై వంతెన నిర్మించాలి

డీఎస్పీ మండల అధ్యక్షుడు మహిపాల్



వాగు వద్ద మాట్లాడుతున్న నాయకులు

కేశంపేట: వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డీఎస్పీ మండల అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ అన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామ శివారు నుంచి పెద్దవాగు నిండుగా ప్రవహిస్తోందని, దీంతో ఆ రోడ్డులో రాకపోకలకు గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయన ఆరోపించాడు. అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో కొప్పు శ్రీకాంత్, పాపకంటి అభిరామ్, భాను తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే, క్లబ్ సభ్యులు

షాద్‌నగర్: యువత నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చటాన్‌పల్లి సమీపంలోని రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు విజేందర్‌రెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, రాజు, శివనాగయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, అశోక్, నర్సింహారెడ్డి, వెంకట్‌నాయక్, శ్రీనివాస్, చందు, నాయకులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన అంతేనా?

వెంకిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు బంద్

- వర్షాకాలం వస్తే భయపడుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- పునాదులకే పరిమితమైన నిర్మాణ పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



అధ్వానంగా ఉన్న వెంకిర్యాల వాగుపై సర్వీస్ రోడ్డు

కొందుర్గు: గత వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ సందర్భంగా రోడ్లకు అడ్డంగా ఉన్న వాగులకు వంతెనలు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఏళ్లు గడుస్తున్నా రోడ్లపై వంతెనల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు మారుతున్నా తమ సమస్యలు తీరడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

2023లో పనులు ప్రారంభం

కొందుర్గు మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఐదేళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్డు నిర్మించారు. అదేవిధంగా ఈ రోడ్డుపై దాదాపు అన్ని వంతెనలు నిర్మించారు. కానీ కొందుర్గు మండలంలోని తంగెళ్లపల్లి, వెంకిర్యాల గ్రామాల మధ్య గల వంతెన మాత్రం నిర్మించలేదు. ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2023లోనే ఎఫ్‌డీఆర్ నిధుల్లో నుంచి రూ.3.20 లక్షలు మంజూరు చేసింది. పనుల నిర్వహణకు టెండర్ పూర్తయ్యింది. అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ 2023 జూన్ 23వ తేదీన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణానికి పునాదులు తీసి దాదాపు ఏడాది కావొస్తోంది. ప్రస్తుతం వంతెన నిర్మాణం పునాదులకే పరిమితంగా మారింది.

సర్వీస్ రోడ్డుతో పొంచి ఉన్న ప్రమాదం

గతంలో పాత వంతెన ఉండటంతో వరదనీరు వంతెనపై నుంచి ప్రవహిస్తేనే రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. కానీ ఉన్న పాత వంతెనను తవ్వి ప్రయాణికుల సౌకర్యార్థం వేసిన సర్వీస్ రోడ్డు ప్రస్తుతం వాగు ఉధృతంగా ప్రవహిస్తే వరదలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో రాకపోకలు పూర్తిగా బంద్ అవుతాయని మండల ప్రజలు వాపోతున్నారు. దీంతో కొందుర్గు మండలంలోని వెంకిర్యాల, ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లి, కాస్లాబాద్, ఎదిర, రావిర్యాల తదితర గ్రామాల ప్రజలకు కొందుర్గు మండల కేంద్రానికి రావడానికి రాకపోకలు నిలిచిపోతాయి. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు మహబూబ్‌నగర్ వెళ్లడానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. మండలంలోని లాలపేట, టేకులపల్లి, గంగన్నగూడ, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాలకు సంబంధించిన రోడ్లపై వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనల నిర్మాణం పూర్తిచేయాలని గతంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలు చేశా రు. ఈ ప్రభుత్వ హయాంలో అయినా వంతెనలు పూర్తయితే తమ ఇబ్బందులు తీరుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రాకపోకలు నిలిచిపోతాయి



వెంకిర్యాల వాగుకు వంతెన నిర్మించకపోవడంతో స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగు నిండుగా పారితే ఈ రోడ్డుపై రాకపోకలు పూర్తిగా బంద్ అవుతున్నాయి. వివిధ పనులపై ఇతర గ్రామాలకు వెళ్లినవారు వాగు దాటే ప్రయత్నంలో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. – లింగంగౌడ్, మాజీ సర్పంచ్, వెంకిర్యాల

వర్షాలు తగ్గితే పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులు చేయడానికి కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నాడు. కానీ వర్షాలు అధికంగా ఉన్నాయి. వర్షాలు తగ్గితే పనులు మొదలుపెడతాం. పనుల ప్రారంభానికి ఇదివరకు ఉన్న కాంట్రాక్టర్ కాస్తా ఆలస్యం చేశాడు. ప్రస్తుతం కాంట్రాక్టర్‌ను మార్చాం. త్వరలోనే పనులు జరిగేలా చూస్తాం.
– రవీందర్‌కుమార్, ఆర్‌అండ్‌బీడీఈ, షాద్‌నగర్

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



డ్వాక్రా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందులో భాగంగా ఆయన బుధవారం మండలంలోని గూడూరు, తీగాపూర్ గ్రామాల్లో డ్వాక్రా భవనాల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సంఘాల కోసం సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. అంతేకాకుండా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం ఉపాధి ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, ఆంజనేయులు, కొమ్ము కృష్ణ, నరేశ్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, రమేశ్, మెండె కృష్ణ, జంగ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

నందిగామ: గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన బుధవారం సుడిగాలి పర్యటన చేసి.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మోత్కులగూడ నుంచి షాబాద్ మండలం కేశారం వరకు రూ.1.20 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణ పనులు, శ్రీనివాసులుగూడ నుంచి మజీద్ మామిడిపల్లి వరకు రూ.58లక్షల వ్యయంతో నిర్మించే సీసీరోడ్డు పనులకు, అదేవిధంగా బండోనిగూడ నుంచి తండా వరకు రూ.1.25లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలో ఇప్పటికే అనేక రోడ్లు మంజూరు చేశామని వెల్లడించారు. గత పాలకులు రోడ్ల అభివృద్ధిపై ఏ మాత్రం శ్రద్ధ చూపలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా అభివృద్ధి పనులను చేయడమే కాకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో సీఎంఆర్‌ఎఫ్ ఆసరా

మాడ్గుల: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన కట్ట సతీష్‌కు రూ.60 వేలు సీఎం సహాయనిధి కింద మంజూరు అయ్యాయి. ఈ మేరకు బుధవారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే బాధితుడికి చెక్కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేసుకోలేక పేదలు ఆర్థిక ఇబ్బంది పడుతుంటారని, అలాంటి వారికి రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని పేదలు ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్ గౌడ్, కట్ట శేఖర్, రమేష్, మల్లేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

టెంట్‌హౌస్ సామగ్రి అందజేత



రమేశ్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీలో గల కట్టపోచమ్మ మైసమ్మ ఆలయానికి బుధవారం పట్టణానికి చెందిన రోమియో రమేశ్ టెంట్‌హౌస్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా ధృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీవాసులు, దాతల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం దాత రమేశ్ దంపతులను సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అందె రాజేశ్వర్, అందె జంగరాజ్, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ పూర్తిస్థాయి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా జిల్లెల్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా శివకృష్ణగౌడ్, కార్యదర్శిగా షేక్‌హాజీ, కోశాధికారిగా సాయినాథ్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా బాలరాజు, టోర్నమెంట్ హెడ్ అడ్వైజర్లుగా నర్సింహ, నందు, కమిటీ ఇన్‌చార్జీలుగా వెంకటేశ్, మల్లేశ్, లింగం, సభ్యులుగా రాములు, బాలు, నరేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు జిల్లెల్ల రమేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో మార్షల్ ఆర్ట్స్‌కు సంబంధించిన కార్యక్రమాలను ముందుండి విజయవంతం చేస్తానన్నారు.తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సీనియర్లకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేస్తున్నానన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు.

ఆలూరు రోడ్డుకు మరమ్మతులు చేపడతాం

- ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డును పరిశీలిస్తూ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

చేవెళ్ల: ఆలూరు రోడ్డు పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌కుమార్ అన్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆలూరు రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో మంగళవారం ఆలూరు మార్గం.. అగమాగం అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం స్పందించారు. ఆర్‌అండ్‌బీ ఈఈతో పాటుగా జేఈఈలు అజయ్‌కుమార్ అనురాధ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్ ఈ రోడ్డును పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిలవటంతో నీరు బయటకు పోయేలా చేస్తున్నామన్నారు. నీరు పోతే కానీ పనులు చేయటానికి వీలుపడదని, ప్రస్తుతానికి గుంతలు పూడ్చే పనులు చేపడుతామని తెలిపారు. ఈ రోడ్డు మంజూరై కాంట్రాక్టర్‌కు అప్పగించిన అతడి నిర్లక్ష్యంతో పనులు ఆగినట్లు తెలిపారు. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడినందుకు గ్రామస్తులు, నాయకులు మట్టిని తవ్విపోయటంతో వర్షానికి పూర్తిగా బురదమయంగా మారిందన్నారు. గుంతల్లో ఉన్న నీళ్లను తొలగించి ఆరిన తరువాత పనులు చేపడుతామన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



మొయినాబాద్: ఎల్కగూడలో బోనాల ఊరేగింపు



షాద్‌నగర్: అమ్మవారి తొట్టెల ఊరేగింపు

షాద్‌నగర్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విద్యుత్ కాలనీలో బుధవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో పోతురాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మొయినాబాద్: మండల పరిధిలోని ఎల్కగూడలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వెంకటరాధాకృష్ణ



విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న సొసైటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ, దన్మయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ వెంకటరాధాకృష్ణ అన్నారు. బుధవారం ఆ సొసైటీ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేశారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో విద్యనభ్యసించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కృషి, పట్టుదల ఉంటే విజయ తీరాలకు చేరుకుంటారన్నారు. యువత మత్తుకు బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం దాతలకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి నిర్మల, కోశాధికారి నాగ శిరోమణి, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు

విద్యాసంస్థల బంద్‌లో వామపక్ష నాయకులు

చేవెళ్ల: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లా విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఆయా సంఘాల నాయకులు అన్నారు. చేవెళ్లలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్ పాటించారు. ప్రైవేట్ పాఠశాలలు ముందుగానే సెలవు ప్రకటించగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రిని కూడా నియమించకుండా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బోజ్జి శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అరుణ్‌కుమార్, నవీన్, వరుణ్, తేజ, అభిరామ్, విష్ణువర్ధన్, అరవింద్, ఆకాశ్, చరణ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

శంకర్‌పల్లి: విద్యాసంస్థల బంద్‌లో భాగంగా బుధవారం శంకర్‌పల్లిలో ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. బంద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హన్మంత్, నవీన్, వరుణ్, తేజ, అభిరామ్, అల్తాఫ్, రాము, విష్ణువర్ధన్, అరవింద్, ఆకాశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: పట్టణంలో ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చేపట్టాలి

మొయినాబాద్/మొయినాబాద్‌రూరల్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చేపట్టాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్, నాయకులు అల్లి దేవేందర్, రేవంత్, ప్రశాంత్, అంకుష్, విష్ణువర్ధన్, వివేక్, సాయి, కమల్, ప్రణీత్, మణికంఠగౌడ్ తదితరులు ఉన్నారు.



విద్యాసంస్థలను బంద్ చేయిస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యాసంస్థల బంద్ విజయవంతం

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులను వసూలుచేస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా ఆర్టీసీలో విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు సుమయిర్, కార్యదర్శి శివశంకర్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సాయి, నరేశ్, రాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కార్తీక్, ప్రకాష్ పాల్గొన్నారు.



మొయినాబాద్: బంద్‌లో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



శంకర్‌పల్లి: మోడల్ స్కూల్‌ను బంద్ చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు